## క్లుప్తంగా

### అధికారుల నిర్లక్ష్యంతోనే కుంగిన బ్రిడ్జి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** వెంకటేశ్వరపురంలో ఫ్లైఓవర్ కుంగిన ఘటనలో అధికారుల నిర్లక్ష్యం కారణమని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. ఫ్లైఓవర్ కుంగిన ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ బ్రిడ్జిపై అనేక గుంతలు ఏర్పడ్డాయని, వీటికి మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులను కోరినా, పట్టించుకోలేదని ఆరోపించారు. పనులను నాసిరకంగా చేపట్టడంతో ఈ దుస్థితి తలెత్తుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ సభ్యుడు మూలం ప్రసాద్, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జాఫర్, నేతలు బయ్యన్న, బాబు, రసూల్, గడ్డం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భగవద్గీతపై ఇంటింటి ప్రచారం

**నెల్లూరు(బృందావనం):** నగరంలోని నవాబుపేట, కృష్ణానగర్, ఎఫ్‌సీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో నగర సంకీర్తన, గీతావైభవ సత్సంగాన్ని గీతావైభవ్ ట్రస్ట్ చైర్మన్, నజీర్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటా భగవద్గీత...నెల్లూరంతా భగవద్గీత అనే నినాదంతో భగవద్గీత వైశిష్ట్యాన్ని వివరిస్తూ విస్తృత ప్రచారాన్ని గీతా వైభవ్ ట్రస్ట్ సభ్యులు నారాయణరేవతి, వరప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టామని చెప్పారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ అసిస్టెంట్ సెక్రటరీలు జయలక్ష్మి, శ్రీనివాసరావు, ఇందిర, కోశాధికారి రాజారామ్, కార్యనిర్వహణాధికారి జాలాది నాగేశ్వరరావు, సభ్యులు శశిధర్, ప్రభావతి, విజిత తదితరులు పాల్గొన్నారు.

### కాలువలకు మరమ్మతులు చేపట్టరూ..



మంత్రితో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

**నెల్లూరు(దర్గామిట్ట):** సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో మంత్రిని ఎమ్మెల్యే ఆదివారం కలిశారు. ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు వద్ద ధ్వంసమైన కరకట్టలు, రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలో పలు సాగునీటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీటిని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### డీవైఎఫ్ఐ నేతల శ్రమదానం

**నెల్లూరు(అర్బన్):** బుజబుజనెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో శ్రమదానాన్ని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రూరల్ నియోజకవర్గ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పలు చోట్ల పిచ్చి మొక్కలను తొలగించిన అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఫిరోజ్, సుబ్రహ్మణ్యం, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, విజయ్‌కుమార్, క్రాంతికుమార్, సమీన్, జీవన్, భానుప్రకాష్, కొండా ప్రసాద్, 25వ డివిజన్ శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారం

**నెల్లూరు(బృందావనం):** బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా ఖాదర్‌బాషా మరో 70 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు నారాయణ, రామనారాయణరెడ్డి మాట్లాడారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి రొట్టెల పండగను జయప్రదం చేయాలని కోరారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తొలుత దర్గాలో బారాషహీదులను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రొట్టెల పండగ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, సయ్యద్ సమీ హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన ఎంపికే కీలకం

- పంటల సాగులో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు
- ఖరీఫ్ సాగుకు రైతన్నల సన్నాహాలు
- అడపాదడపా కురుస్తున్న వర్షాలు

**వరికుంటపాడు:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఖరీఫ్ పంటల సాగు కోసం సన్నాహాలు చేసుకుంటున్నారు. పంటల సాగులో చీడపీడలను నివారించి అధిక దిగుబడులు సాధించాలంటే విత్తన ఎంపికే కీలకమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. విత్తన ఎంపికతోపాటు ఎరువులు, పురుగుమందుల కొనుగోలు విషయాల్లో కూడా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఏడాది రుతుపవనాలు ముందుగానే రావడంతో అడపాదడపా వర్షాలు కురుస్తూ ఉన్నాయి. దీంతో రైతులు తమ పొలాలను దుక్కులు చేసి పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, మర్రిపాడు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఇటీవల కాలంలో ఓ మోసరు వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో పంటల సాగు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు వివరిస్తున్నారు. ప్రధానంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

**విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు**

వ్యవసాయశాఖ మంజూరు చేసిన లైసెన్స్ పొందిన డీలర్ వద్ద, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో కొనుగోలు చేసే వస్తువుకు సక్రమంగా సీలు వేసి ఉందో చూసుకోవాలి. ధ్రువీకరణ పత్రం ఉన్న బస్తాలనే కొనుగోలు చేయాలి.



గండిపాళెం జలాశయం ఆయకట్టు పరిధిలో పంటల సాగుకు సిద్ధం చేసిన పొలం

విత్తనాల సంచులపై విత్తన రకం, ల్యాట్ నెంబర్, గడువు తేదీ తదితర విషయాలు సరిచూసుకోవాలి. కొనుగోలు చేసిన వస్తువుకు డీలర్ సంతకంతో ఉన్న బిల్లు రసీదును తప్పకుండా తీసుకోవాలి. వ్యవసాయశాఖ అధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేస్తే మంచిది.

**విత్తనశుద్ధి ఇలా..**

పంటల సాగులో విత్తనశుద్ధి కూడా కీలకమే. విత్తనశుద్ధి ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. థైరేన్ లేదా కార్బండిజం ఒక గ్రాము ఒక కేజీ విత్తనానికి లేదా మ్యాంకోజెబ్ 3 గ్రాములు ఒక కేజీ విత్తనానికి ఉపయోగించి విత్తనశుద్ధి చేసుకోవచ్చు. సబ్ డిజన్ పరిధిలో ఖరీఫ్‌లో ఎక్కువగా కంది, సజ్జ, వరి, మినుము పంటలను రైతులు సాగు చేస్తారు. విత్తనశుద్ధిలో మందు రకం, మోతాదుల విషయంలో వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలి. తెగుళ్లు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా విత్తనం నాటిన 20 రోజుల్లోపు మ్యాంకోజెబ్ 3 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలి. అనంతరం చేతులు, ముఖం సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

**విత్తనశుద్ధి తప్పనిసరి**



ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి. పంటల సాగుకు ముందు విత్తన ఎంపిక, విత్తనశుద్ధి ఎంతో కీలకం. ఏ పంటకైనా మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వాడకూడదు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి.. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలి.

– పి.చెన్నారెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, ఉదయగిరి



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శారద (ఫైల్)

### భక్తిశ్రద్ధలతో చండీహోమం



ముత్యాల అలంకారంలో నాగార్పమ్మ అమ్మవారు

**సంగం:** మండలంలోని కోలగట్ల గ్రామంలో వెలసిన శ్రీనాగార్పమ్మ ఆలయంలో ఆదివారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అర్చకులు చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## తాగునీటి పథకాలకు మరమ్మతులు చేపట్టాలి

**సీతారామపురం:** మండలంలోని పడమటిరొంపిదొడ్ల గ్రామంలో రెండు తాగునీటి పథకాలకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని మినీ వాటర్‌స్కీం, పైలట్ ప్రాజెక్ట్ మోటర్లు కాలిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం చేతిపంపులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. గ్రామంలో రెండు చేతిపంపులు ఉండగా అందులో ఒకటి చెడిపోయిందన్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని తాగునీటి పథకాలకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన తాగునీటి పథకం

### ఘన సన్మానం



**ఉదయగిరి:** మండలంలోని గండిపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన షేక్ జాఫర్‌సాహెబ్ గత నెల 30వ తేదీన పదవీ విరమణ చేసిన నేపథ్యంలో ఆదివారం ఉదయగిరిలో ఆయనను తోటి ఉపాధ్యాయులు, బంధువులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు తోట శ్రీనివాసులు, మస్తాన్‌వలి, విశ్రాంత ఉద్యోగులు షేక్ ఖాజామొహిద్దీన్, మోహనరావు, నారాయణరావు, ఓబుల్‌రెడ్డి, అల్లాభక్షు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గరుడోత్సవం నేడు

**నెల్లూరు(బృందావనం):** నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గరుడోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్చభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న శోభాయాత్ర నిర్వాహకులు



పాల్గొన్న కమిటీ సభ్యులు

**ఆత్మకూరు:** ఆత్మకూరులో తొలిసారిగా నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీన ఆత్మకూరు పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో శోభాయాత్ర కమిటీ సభ్యులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుమారు 2 వేల బైక్‌లు ర్యాలీలు పాల్గొనేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రత్యేక వాహనంలో సీతారామ పట్టాభిషేక ఘట్టం, మరో వాహనంలో హనుమాన్ విగ్రహం ఇలా పలు దేవతామూర్తుల విగ్రహాలతో వాహనాలు ఈ శోభాయాత్రలో పాల్గొంటాయన్నారు. మహిళలు ప్రత్యేక వాహనంలో హనుమాన్ చాలీసా, ఆంజనేయ దండకం పారాయణం చేస్తూ యాత్రలో పాల్గొంటారని తెలిపారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా 200 మంది వలంటీర్లతో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. నిర్దేశించిన మార్గంలో బైపాస్ రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమయ్యే ఈ శోభాయాత్ర పాత సినిమా హాలు సెంటర్ మీదుగా సత్రం సెంటర్, చావడి, హిల్ రోడ్డు, ఎరుకలసానినగర్, సోమశిల రోడ్డు సెంటర్, ఎల్ఆర్‌పల్లి, జేఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో వరకు కొనసాగి తిరిగి మెయిన్ బజారు మున్సిపల్ బస్టాండ్ మీదుగా రవితేజ కల్యాణ మండపం వరకు కొనసాగుతుందని తెలిపారు. యాత్ర అనంతరం కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. హిందువులందరూ ఈ శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ



బీసీకాలనీ చాకలకొండ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- ప్రబలుతున్న వ్యాధులు
- అప్రమత్తత ఎంతైనా అవసరం

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వింజమూరులో చిరుజల్లులు కురిసినా వర్షపునీరు వెళ్లేందుకు వీలులేక వీధుల్లో నిల్వ ఉంటోంది. తద్వారా దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. వింజమూరులోని ఎస్టీకాలనీ, బీసీకాలనీల్లో చిన్నవర్షం కురిసినా వీధుల్లో నీరు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. హిందూనగర్‌లో పంట కాలువ పూడ్చివేయడంతో కాలువల్లో నీరు నిల్వ ఉండి దోమలు పెరుగుతున్నాయి. పంచాయతీ పాలకులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో అంతర్గత రోడ్లపై వర్షపునీరు, మురుగునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు బయటకు వెళ్లే వ్యవస్థ ఏర్పాటుకు పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

**అల్లూరు:** మొహర్రంను పురస్కరించుకుని ఆదివారం స్థానిక తూర్పు మహమ్మదీయపాళెంలో ఉన్న ఇమామ్ ఖాసీం పీర్ల చావడి వద్ద లంగరు కార్యక్రమాలను నిర్వహించారు. ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు నెరవేర్చుకున్నారు. సోమవారం మసీద్ సెంటర్‌లోని మౌలాలి దర్గా వద్ద మౌలాలి సేరా గ్రామోత్సవం నిర్వహిస్తారని, మంగళవారం మోపూర్ పీర్ మోపూర్ నుంచి అల్లూరుకు గ్రామోత్సవం చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముజావర్లు కరిముల్లా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

**మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలి**

**సీతారామపురం:** గ్రామాల్లో మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై అనూష సూచించారు. ఆమె ఆదివారం స్థానిక కోటవీధిలోని పీర్లచావిడి వద్ద కమిటీ సభ్యులతో మాట్లాడారు. మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపుల్లో వివాదాలు లేకుండా కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. అనంతరం పీర్లచావిడి ప్రాంతంతోపాటు మెయిన్ బజారులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.



అల్లూరు: ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

**మొహర్రం ప్రార్థనలు**

**ఆత్మకూరు:** మొహర్రంను పురస్కరించుకుని ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లిలో ఉన్న జెండా చెట్టు వద్ద పీర్లను నిలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్ల సాంబ్రాణి వేశారు. సోమవారం అగ్నిగుండం, మంగళవారం పీర్లకు స్నానాదికాలు, అనంతరం అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులుతెలిపారు.

**పీర్లచావిడిలో..**

**ఉదయగిరి:** మొహర్రంను పురస్కరించుకుని ఉదయగిరి పట్టణంలోని నాగులబావివీధి పీర్లచావిడిలో ఆదివారం పీర్లను ప్రతిష్ఠించారు. సోమవారం నాగులబావి వీధి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని గుంతబజారులో కూడా మొహర్రం ప్రార్థనలు నిర్వహించారు.



మర్రిపాడు: పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

**ఘనంగా పీర్ల ఊరేగింపు**

**మర్రిపాడు:** పీర్ల పండగ (మొహర్రం) సందర్భంగా మర్రిపాడులో ఆదివారం పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో పీర్ల చావిడిలో ఉన్న పీర్లకు మొక్కుకున్నారు. పీర్ల ఉరేగింపు కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత

**మర్రిపాడు:** మండలంలోని అల్లంపాడుకు చెందిన షేక్ సమీం అనే దివ్యాంగురాలికి ఆత్మకూరు శ్రీవెంకటేశ్వర ప్రజా వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రణీత్.. వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రైసైకిల్‌ను ఆదివారం అందజేశారు. డాక్టర్ ప్రణీత్ తమ ట్రస్టు సభ్యులతో కలిసి అల్లంపాడుకు వెళ్లి ట్రైసైకిల్‌ను సమీంకు అందజేశారు. కార్యక్రమంలో తోడేటి అశోక్, ఆది, వెంకటేశ్వర్లు, సమ్మద్, మౌలాలి, పెద్ద కాలేమస్తాన్, రసూల్, అబ్దుల్‌గఫార్, మహమ్మద్ గౌస్, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



సమీంకు ట్రైసైకిల్ అందజేసిన డాక్టర్ ప్రణీత్

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

**ఆత్మకూరురూరల్:** మండలంలోని నువ్వూరుపాడు, అశ్వనీపురం, జంగాలపల్లి, మహిమలూరు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి పొదలకూరు ప్రాంత అధ్యక్షుడు పెంచలయ్య త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు పెంచలస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు మురగళ్ల సుధాకరాచారి, హరి, అభినయ, కొండయ్య, శేషాద్రి, కృష్ణయ్య, గాయత్రి, జాహ్నవి, మధు తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను ప్రదర్శిస్తున్న సభ్యులు

### పాముల హల్‌చల్

**బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువులో పాములు ఆదివారం కలకలం సృష్టించాయి. ఒక్కసారిగా ఇవి కనిపించడంతో చెరువులో స్నానమాచరించే భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు చొరవ చూపి వీటిని తరిమారు. అధికారులు స్పందించి చెరువును పరిశుభ్రంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.**

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు




స్వర్ణాల చెరువులో పాము



తరుముతున్న చిన్నారులు

# తల్లీబిడ్డల ఆరోగ్యానికి అభయం



వైద్య పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్ పద్మజ



గర్భిణికి పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారులు

- ప్రతినెలా వైద్యపరీక్షలు తప్పనిసరి

**కోవూరు :** మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని బుచ్చి సీహెచ్‌సీ గైనకాలజిస్టు డాక్టర్ జి.పద్మజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లీబిడ్డల ఆరోగ్యం గురించి ఆమె ఆదివారం మాట్లాడారు. గర్భం దాల్చిన మహిళ తొలి నుంచి ఒకే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనివల్ల ఆ గర్భిణికి సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే సీహెచ్‌సీలో మాతా శిశు సంరక్షణ కార్డులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఐదేళ్ల వయస్సు వరకు ఈ కార్డు వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. తల్లికి బిడ్డకు ఈ కార్డులో ప్రత్యేక ఐడీ నంబర్లు ఇస్తున్నారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా చేయించుకోవాల్సిన వైద్య పరీక్షల సమయాలు వాటిలో పొందుపరుస్తారని వివరించారు. దీని ఆధారంగా వైద్య సేవలు పొందడం ద్వారా బిడ్డను ప్రసవించే నాటికి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతారన్నారు. వీటితో పాటు ప్రధాన మంత్రి మాతృత్వ సంరక్షణ యోజన ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం అందించే వివరాలను కూడా అందులో పొందుపరుస్తారన్నారు. తొలి కాన్పులో సాధారణంగా తలెత్తే సమస్యల వివరాలు, బిడ్డకు ముర్రుపాలు, తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించే అంశాలను కార్డులో ముద్రించి ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలు, పిల్లలకు శారీరక మానసిక ఎదుగుల సంబంధించిన అంశాలను గుర్తించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలు నమ్మకం కలిగి ఉండాలన్నారు.